3 నుంచి పింఛన్ల పంపిణీ

తిరువూరు: వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారులకు ఈ నెల మూడో తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు తిరువూరు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పెన్షన్ ను రూ.2,750 నుంచి రూ.3వేలకు పెంచినందున మండలంలోని 6,886 పింఛన్లను వారోత్సవాలలో భాగంగా 3వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.







నేడు 120 అడుగుల మహాస్థూపం ఆవిష్కరణ


సాయిబాబా గుడిలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: మైలవరం గుర్రాజుపాలెం క్రాస్ రోడ్డు వద్ద నూతనంగా నిర్మించిన 120 అడుగుల ఎత్తుగల సాయికోటి మహాస్థూపం సోమవారం ఆవిష్కరించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మహా స్థూపం ఏర్పాటు చేసిన షిరిడీ సాయిబాబా సేవాశ్రమం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాస్థూపం, ఆలయంలోని స్వామి వారి విగ్రహం వద్ద మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రధాన రహదారుల్లో భక్తులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సాయిబాబా బోధనలో ప్రేమ, కరుణ, దానం, సంతృప్తి, శాంతి, దైవారాధన, గురుపూజ ముఖ్యమన్నారు.

నూతన బోరు, మోటారు ఏర్పాటు


వలసపల్లిలో బోరు వేయిస్తున్న సర్పంచ్, ఉపసర్పంచ్

ముసునూరు: గ్రామ ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.70.4 లక్షలతో నూతన బోరు, మోటారు, పైపులైన్లు వేయించి, తాగునీటి సరఫరా కల్పిస్తున్నట్లు వలసపల్లి సర్పంచ్, ఉప సర్పంచ్ చలసాని దామోదర్, దారగాని సుబ్బారావు తెలిపారు. రూ.45.4 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో ఎస్సీ ఏరియాలోని ప్రజల సౌకర్యార్థం నల్లచెరువు వద్ద ఆదివారం బోరు వేయించారు. దీనికి నూతన మోటారు బిగించి, గ్రామం అంతటా పైప్‌లైన్లు వేయించనున్నట్లు తెలిపారు. దీనికి అనుసంధానంగా రూ.25 లక్షలతో 40,000 లీటర్ల నీటి సామర్థ్యం గల వాటర్ ట్యాంకు నిర్మాణం ఇప్పటికే చేపట్టామన్నారు.








అంక్షలు ఉల్లంఘిస్తే చర్యలు

ఆగిరిపల్లి: మండలంలోని నూతన సంవత్సర ఆరంభం దృష్ట్యా ప్రత్యేక ఆంక్షలు విధించినట్టు ఎస్సై చంటిబాబు తెలిపారు. మద్యం తాగి బైక్ నడపడం, ట్రిపుల్ రైడింగ్, బాణసంచా కాల్చడం, నిషిద్ధమని చెప్పారు.



















ఆలయాల్లో ధనుర్మాసోత్సవాలు

తిరువూరు: పట్టణంలోని పలు దేవాలయాల్లో ఆదివారం ధనుర్మాస సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. రాజుపేట వీరాంజనేయస్వామి ఆలయంలో అమ్మవారికి లక్ష తులసీదళాలతో అర్చన చేశారు. వైష్ణవ సంప్రదాయానుసారం తిరుప్పావై పఠించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తిరువూరు కోదండ రామాలయంలో పుష్ప యాగం కార్యక్రమం జరిగింది. పలు రకాల పుష్పాలతో సీతారాములకు అర్చన చేసి అలంకరణ గావించారు. వేంకటాచలస్వామి ఆలయం, రంగనాయక స్వామి దేవస్థానాలలో కూడా ధనుర్మాస విశేష పూజలు నిర్వహించారు.

కనులవిందుగా పుష్పయాగం

గంపలగూడెం: గంపలగూడెం సీతారాచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పుష్పయాగం కనుల విందుగా నిర్వహించారు. ఆలయ అర్చకులు దేవయనిజం శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. మహిళలు తిరుప్పావై పఠనం చేశారు.



తిరువూరు రాజుపేట వీరాంజనేయస్వామి ఆలయంలో లక్షతులసీ దళార్చన

వైఎస్సార్ సీపీ మండల కమిటీల నియామకం

తిరువూరు: వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు నూతన కమిటీలను నియమించింది. తిరువూరు మండల పార్టీ అధ్యక్షుడిగా శీలం నాగనర్సిరెడ్డి, ఉపాధ్యక్షులుగా మన్నె గోపాలరావు, పొన్నూరు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులుగా గోదా హనుమంతరావు, అంకిరెడ్డి మురళీకృష్ణారెడ్డి, చిప్పగిరి కృష్ణ, కోశాధికారిగా వేమిరెడ్డి పిచ్చిరెడ్డి, కార్యదర్శులుగా కొమ్మినేని నరేష్, వంకాయలపాటి వెంకటరత్నం, తేళ్ళూరి నాగేశ్వరరావు, నల్లమోతు శ్రీనివాసరావు, చాట్ల నాగేశ్వరరావు, గుంజి కేశవులు, తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులు నియమితులయ్యారు.

తిరువూరు టౌన్ కార్యవర్గం

అధ్యక్షుడిగా చలమాల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా షేక్ రాజ్ మహ్మద్, కంచర్ల దుర్గారావు, ప్రధాన కార్యదర్శులుగా వేమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, తిరుమలశెట్టి వేణు, బొప్పన సాంబశివరావు, కోశాధికారిగా గొండేల చంద్రమౌళి, కార్యదర్శులుగా బండి అంజయ్య, చాపలమడుగు ఏసుపాదం, పెందుర్తి మోషే, షేక్ ఖాసిం, గుంజా శ్రీరాములు నియమితులయ్యారు.

విస్సన్నపేట మండల కార్యవర్గం

అధ్యక్షుడిగా భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులుగా కోట శ్రీనివాసరావు, తానంకి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులుగా నక్కా రాజు, మాలరాజు మధు, తుమ్మలపల్లి చెన్నారావు, కోశాధికారిగా మిరియాల రమేష్, కార్యదర్శులుగా గొర్ల మాధవరెడ్డి, కంటి మురళి, పిల్లిబోయిన సురేష్, దారావతు సూరిబాబు, బాడిశ లక్ష్మీబాబు, కోలేటి పాపారావు నియమితులయ్యారు.

గంపలగూడెం మండల కార్యవర్గం

అధ్యక్షుడిగా చావా వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎండీఎస్ మల్లేశ్వరరావు, దుంపా వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా బరిగల అంజయ్య, వంగల వైకుంఠం, ఆకుల వెంకటేశ్వరరావు, కోశాధికారిగా జూలూరి ప్రసాద్, కార్యదర్శులుగా వజ్రాల ప్రవీణ్ రెడ్డి, మాదాసు నరసింహారావు, జొన్నలగడ్డ ప్రేమరాజు, పత్తిపాటి అజయ్‌కుమార్, వంగల గోపాల్, గుంజా అంజయ్య నియమితులయ్యారు.

ఏకొండూరు మండల కార్యవర్గం

అధ్యక్షుడిగా భూక్యా గన్యా, ఉపాధ్యక్షులుగా కావూరి నాగేశ్వరరావు, వజ్రాల బ్రహ్మారెడ్డి, ప్రదాన కార్యదర్శులుగా గంధం వెంకన్న చౌదరి, ఆకుల శ్రీనివాసరావు, మునగా ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా నరెడ్ల నరేంద్రరెడ్డి, కార్యదర్శులుగా మూడు రవికుమార్, వాడపల్లి రామకృష్ణ, ముదిగొండ వెంకటేశ్వరరావు, పిన్నిబోయిన మల్లేశ్వరరావు, పుచ్చకాయల వడ్డీకాసులు, గడ్డి శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

మునునూరు: కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరవుతున్న పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని ఇన్‌చారిజ ఎంపీడీఓ సాయిరాము సూచించారు. చెక్కపల్లి, చింతలవల్లి గ్రామాల్లో ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ యోహాన్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు టి.రాధిక, పిల్లి సత్యనారాయణ అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా పీహెచ్‌సీల వైద్యాధికారులు కరీముల్లా, షకీనా ఇవాంజిలిన్ తమ శాఖ ద్వారా అందుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు.

సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించాలి

తిరువూరు: మహిళా సాధికారతకు, విద్యాభివృద్ధికి విశేషకృషి చేసిన సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ గంగాధర్ కోరారు. తిరువూరు సుందరయ్య భవనంలో ఆదివారం ఉదయం జనవిజ్ఞాన వేదిక సమావేశం నిర్వహించారు. జనవరి 3న సావిత్రీబాయి పూలే జయంతిని అన్ని విద్యాసంస్థలు, కార్యాలయాల్లో నిర్వహించే విధంగా ప్రభుత్వం ఆదేశాలివ్వాలని కోరారు. జనవరి 7న జరిగే జిల్లా స్థాయి చెకుముకి సామర్థ్య పరీక్షలో అర్హులైన విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.

కిటకిటలాడిన దుకాణాలు



ఆగిరిపల్లిలో స్వీట్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఆగిరిపల్లి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆగిరిపల్లిలో ఆదివారం పండగ వాతావరణం నెలకొంది. బస్టాండ్ సెంటర్, విజయవాడ రోడ్డు, మెయిన్ రోడ్డు జనంతో కిటకిటలాడింది. ఆగిరిపల్లిలో పలు బేకరీలు, పండ్లు, స్వీట్లు, బిర్యానీ, దుకాణాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. ఏ స్టాల్ వద్ద చూసినా కొనుగోలుదారులు దర్శనమిస్తున్నారు. జోరుగా కొనుగోలు జరగడంతో వ్యాపారుల్లో ఆనందంతో అమ్మకాలు జరిపారు.

న్యూ ఇయర్ సందడి

చాట్రాయి: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో సందడి నెలకొంది. ఈ సందర్భంగా చనుబండ, చాట్రాయి, పోలవరం గ్రామాల్లోని సెంటర్లో బ్యాకరీలు, స్వీట్ షాపులు, పూల మార్కెట్లు కిట కిటలాడాయి. చర్చిల్లో ఈ అర్ధరాత్రి నుంచి ప్రార్థనలు నిర్వహించి కేక్‌లు కట్‌చేశారు. ప్రతి ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులతో మహిళలు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.

సైన్స్ ఎక్స్‌పోలో వెల్లివిరిసిన విద్యార్థుల సృజనాత్మకత



సైన్స్ ఎక్స్‌పో తిలకిస్తున్న డాక్టర్ రవీంద్రనాథ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని రవీంద్రభారతి విద్యా సంస్థకు చెందిన నెక్స్ జెన్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన పలు ప్రాజెక్ట్‌లో విద్యార్థుల సృజనాత్మకత వెల్లివిరిసింది. ఇందులో చంద్రయాన్, వాటర్ డ్యామ్, ఎలక్రికల్ పవర్ సప్లై నైబర్‌హుడ్, దేవతా రూపాలు, సౌర కుటుంబం, జానపద కళారూపాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రాహాస్పిటల్ డాక్టర్ ఎం రవీంద్రనాథ్ సైన్స్ ఎక్స్‌పోను తిలకించి నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులతో ముచ్చటించారు. విజయవాడ రవీంద్రభారతి విద్యా సంస్థల చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ వివిధ నమూనాలను తయారు చేసిన విద్యార్థులు, వారికి అండగా నిలిచిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ప్రశంసించారు. స్కూల్ డైరెక్టర్ వీరమాచనేని శాంతి, పాఠశాల వివిధ బ్రాంచిల జనరల్ మేనేజర్ రాజేష్, జోనల్ ఇన్‌చార్జి సరళాదేవి, క్యాంపస్ ప్రిన్సిపాల్ కె.సరిత, వైస్ ప్రిన్సిపాల్స్ ఎం.సరిత, పీ మోనిక, క్యాంపస్ ఇన్‌చార్జి తరుణ్ కుమార్ పాల్గొన్నారు.

అన్యోన్య జీవనంతో కుటుంబ వ్యవస్థ పటిష్టం

అల్లూరు(వీరులపాడు): భార్యాభర్తలు ఎటువంటి మనస్పర్థలకు తావులేకుండా అన్యోన్యంగా జీవనం సాగించినప్పుడే కుటుంబవ్యవస్థ మరింత పటిష్టమవుతుందని ఏసీపీ జనార్ధన్‌నాయుడు పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న నేరాలు, అఘాయిత్యాలపై మండలంలోని అల్లూరులో మహిళలు, విద్యార్థులకు ఆదివారం రాత్రి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ జనార్ధన్‌నాయకుడు మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోకుండా చదువుపై దృష్టిసారించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, రక్త సంబంధీకులు చెప్పే మాటల కంటే చెడునడవడిక కలిగినవారి మాటల ప్రభావం యువతపై ఉంటోందన్నారు. అటువంటి ధోరణిని విడనాడాలని యువతీయువకులకు సూచించారు. ప్రతిఒక్కరు సమాజానికి, దేశానికి ఉపయోగపడేలా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ మహాలక్ష్మణుడు, సర్పంచ్ బందెల రాణి, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, ఎంపీటీసీ సభ్యురాలు మోండ్రు బాయమ్మ, ఉపసర్పంచ్ బెల్లంకొండ నాగేశ్వరరావు, నాయకులు కుంపటి శ్రీను, రాజగోపాల్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.















అయోధ్య రాముని అక్షింతల పంపిణీ



కాచవరం రామలింగేశ్వరస్వామి ఆలయంలో అక్షింతలకు పూజలు



గంపలగూడెంలో అక్షింతలకు ప్రత్యేక పూజ



అక్షింతలను వితరణకు సిద్ధం చేస్తున్న భక్తులు

కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరం రామలింగేశ్వరస్వామి ఆలయంలో అయోధ్య రాముని దివ్య అక్షింతలకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సుబ్రహ్మణేశ్వరశర్మ భక్తులచేత విఘ్నేశ్వర పూజ చేయించారు. గ్రామ వికాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రముఖులు తిరుపతయ్య అధ్యక్షతన పూజా కార్యక్రమాలు జరిగాయి. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పూజల్లో పాల్గొని అయోధ్య శ్రీరామచంద్రమూర్తి అక్షింతలు ప్రసాదంగా స్వీకరించారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: అయోధ్య రామయ్యను తాకిన అక్షింతల కలశాలకు ఆదివారం గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అక్షింతలను వృద్ధి చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం నుంచి భక్తులకు పంపిణీ చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రచారక్ విశ్వనాథ్, రామసేవకులు క్రాంతి, రవి, పుల్లారావు, నాగేశ్వరరావు, బుజ్జి పాల్గొన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ

జి.కొండూరు: ఇటీవల జి.కొండూరు కోదండ రామాలయానికి చేరిన అయోధ్య రామయ్య అక్షింతలకు ఆలయ నిర్వాహకులు ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం సమీప గ్రామాలైన ఆత్కూరు, గడ్డమణుగు, చెర్వుమాధవరం, మునగపాడు, సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేని, దుగ్గిరాలపాడు, పినపాక గ్రామాలకు అక్షింతలను పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకుడు నాగరాజు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: అయోధ్య రామ స్పర్శ అక్షింతలు ఇంటింటికీ వితరణలో భాగంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న కోదండ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో అక్షింతలు ప్యాకింగ్ కార్యక్రమం భక్తులు ఆదివారం నిర్వహించారు. అయోధ్య రామ స్పర్శ అక్షింతలు ప్రతి భక్తుని ఇంటికి పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆటోవర్కర్స్ యూనియన్ కార్యవర్గ ఎన్నిక



ఎన్నికైన యూనియన్ కార్యవర్గం

తిరువూరు: ఏఐటీయూసీ అనుబంధ ఆటోవర్కర్స్ యూనియన్ తిరువూరు ఏరియా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక సుంకర వీరభద్రరావు భవన్లో జరిగిన ఎన్నికలో అధ్యక్షుడిగా ఎస్కే హుసేన్, ఉపాధ్యక్షుడిగా జీవ, కోశాధికారిగా కృష్ణ, కార్యదర్శిగా సురేష్, సంయుక్త కార్యదర్శిగా కిరణ్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా మాలపాటి ఉదయ్, సుబానీ ఎన్నికయ్యారు.

హక్కుల పరిరక్షణకు కృషి

విస్సన్నపేట: ప్రజలందరికీ స్వేచ్ఛా సమానత్వంతో పాటు కార్మికవర్గ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు అన్నారు. స్థానిక ఏఎంసీ మార్కెటింగ్ గోడౌన్ వద్ద తిరువూరు నియోజకవర్గ ఏఐటీయూసీ మహాసభ ఎం త్యాగరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు చాట్ల పుల్లారావు, రైతుసంఘం జిల్లా నాయకుడు తూము కృష్ణయ్య పాల్గొన్నారు.






6న వ్యాపార షాపుల వేలం పాట

బొర్రగూడెం(మైలవరం): మైలవరం మండలం బొర్రగూడెంలో వేంచేసియున్న తిరుపతమ్మ గోపయ్యస్వామి వార్ల ఆలయంలో వివిధ రకాల పూజా సామగ్రి, పిల్లల ఆట వస్తువులు అమ్ముకోవడానికి, వంట సామాను అద్దెకు ఇవ్వడానికి కావాల్సిన షాపుల వేలం ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలవాడు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

పారిశుద్ధ్య పనులు ప్రారంభం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీలో పారిశుద్ధ్యం పనులు యుద్ధ ప్రాదిపతికన చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు సమ్మె బాట పట్టిన నేపథ్యంలో పట్టణంలో అనేక ప్రాంతాల్లో చెత్త తొలగింపు పనులు నిలిచిపోయాయి. పండగ వేళల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు ఎస్ఎంఆర్ కూలీలతో పనులు చేపట్టారు. ఎస్ఎంఆర్ కూలీల రాకతో పట్టణంలో పేరుకుపోయిన చెత్త తొలగింపునకు మార్గం సుగమం అయింది. సమ్మె చేస్తున్న కూలీలు ఎస్ఎంఆర్ కూలీలను అడ్డుకోవడంతో పోలీసులు రంగప్రవేశం చేసి పనులు సవ్యంగా జరిగేలా చూశారు.



























ఐదు సిమెంట్ బల్లలు వితరణ



అవనిగడ్డ: అవనిగడ్డలో పలు ప్రాంతాల్లో శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాం కిశోర్ నాయుడు రూ.20వేలు విలువగల ఐదు సిమెంట్ బల్లలను వితరణ ఇచ్చారు. తన తండ్రి తోట చక్రపాణి జ్ఞాపకార్థం స్థానిక వంతెన సెంటర్, పెట్రోల్ బంక్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానం ప్రాంతంలో వీటిని ఆదివారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తోట శ్యాంకృష్ణ, గుడివాక శేషుబాబు, యలవర్తి నాంచారయ్య, మోపిదేవి కోటేశ్వరరావు, బచ్చు ఆదినారాయణ, ఆదిశేషు పాల్గొన్నారు.



దాతల సేవలు స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: నిరాశ్రయులైన పేదలను ఆదుకొనేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకొచ్చి సేవలందించడం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని మందపాకల శివారు చింతకోళ్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న జీవితాలయం అనాథ వృద్ధాశ్రమ నిర్మాణానికి ఆదివారం రమేష్‌బాబు శంకుస్థాపన చేశారు. జేబీడబ్ల్యూ ట్రస్ట్ చైర్మన్ ఎన్‌టీ నారాయణరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో రమేష్‌బాబు మాట్లాడారు. సముద్రతీరానికి ఆనుకొని ఉన్న చింతకోళ్ల గ్రామంలో కూడా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు జేబీడబ్ల్యూ ట్రస్ట్ ముందుకు రావడం హర్షణీయమని రమేష్‌బాబు అన్నారు. ఆశ్రమ నిర్మాణానికి తన వంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. చింతకోళ్ల గ్రామంలో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని, త్వరలోనే పనులను కూడా ప్రారంభిస్తామని రమేష్‌బాబు చెప్పారు. మార్చి నాటికి ఇరాలి–చింతకోళ్ల గ్రామాల మధ్య రహదారిని నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిని కూడా ఏర్పాటు చేసి తాగునీటి కష్టాలు లేకుండా చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ముందుగా ఆశ్రమ నిర్మాణానికి భూమి పూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, లెటర్ ఆఫ్ గాస్పెల్ మినిస్ట్రీస్ ప్రతినిధి రాజ్‌మనోహర్ నీలా, ఆశ్రమం ఫౌండర్ గుదే వెంకటేశ్వరమ్మ, స్థల దాతలు దినేష్‌బాబు, ధనుష్, దివ్యసుధ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

బందరు డీఎస్పీ బదిలీ

కోనేరుసెంటర్: బందరు డీఎస్పీ వై. మాధవరెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. బందరు డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న మాధవరెడ్డిని సీఎం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. డీజీపీ ఉత్తర్వుల మేరకు మాధవరెడ్డి బందరు డీఎస్పీగా రిలీవ్ కాగా ఆయన స్థానంలో దిశా డీఎస్పీ యు. నాగరాజును బందరు ఇన్‌చార్జ్ డీఎస్పీగా నియమిస్తూ జిల్లా ఎస్పీ పి. జాషువా ఉత్తర్వులు జారీ ఇచ్చారు.

ఘనంగా జాతర

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులో శ్రీ గంగానమ్మ అమ్మవారి జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. రజక సంఘం ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యుడు రాచమళ్ల శ్రీనివాసరావు, రత్నకుమారి దంపతుల పర్యవేక్షణలో గంగానమ్మకు ఘటం కుండలతో చద్దియ్యాపారం (సద్దన్నం) నిర్వహించారు. ఘటం కుండలతో గ్రామంలో పర్యటించి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమాలల్లో రజక సంఘం అధ్యక్షుడు రాచమళ్ల అంజయ్య పాల్గొన్నారు.



సుబ్బారాయుడి ఆలయంలో కోలాహలం

మోపిదేవి: రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తజనంతో మోపిదేవిలో వేంచేసిఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం కోలాహలంగా మారింది. ఏడాది చివరి ఆదివారం సెలవుదినం కావడంతో పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తెల్లవారుజాము నుంచే క్యూలైలన్నీ నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్ల శాలల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: అనారోగ్యంతో బాధపడుతూ కష్టాల్లో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరం లాంటిదని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఇటీవల మోకాలి ఆపరేషన్ చేయించుకున్న పోచంపల్లి గ్రామానికి చెందిన చెరుకూరి సూర్యలక్ష్మికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.70వేల చెక్కును ఆదివారం తన నివాసంలో ఎమ్మెల్యే ఉదయభాను లబ్ధిదారురాలికి అందజేశారు. పేదలపై వైద్యఖర్చుల భారం ఉండకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహనర్ రెడ్డి ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందని వివరించారు. లబ్ధిదారు కుటుంబం ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేసింది.



చెక్కు అందజేస్తున్న విప్ ఉదయభాను

ముగ్గురు పందెం రాయుళ్ల అరెస్ట్

తోట్లవల్లూరు: కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి జరిపిన ఘటన మండలంలోని గురివిందపల్లిలో ఆదివారం జరిగింది. స్థానిక కృష్ణానది తీరంలో నిర్వహిస్తున్న కోడిపందేలపై దాడి జరిపి ముగ్గురు పందెం రాయుళ్లను, ఒక కోడి పుంజు, రూ.850 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.విశ్వనాథ్ తెలిపారు.



గ్రంథాలయంలో అందుబాటులోకి కంప్యూటర్లు

గన్నవరం: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో దాతలు అందజేసిన కంప్యూటర్లను ఆదివారం వినియోగంలోకి తీసుకువచ్చారు. రోటేరియన్ జాస్తి వెంకటకృష్ణారావు ఇటీవల గ్రంథాలయానికి రెండు కంప్యూటర్లను బహూకరించారు. విద్యార్థులు, పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వినియోగించుకునే విధంగా ఈ కంప్యూటర్లను అందుబాటులో ఉంచారు. వీటికి రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు చిమట రామారావు సౌజన్యంతో ఇంటర్‌నెట్ సదుపాయం కలిపించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నర్రా సీతారామారావు మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. గ్రంథాలయంలోని పుస్తక సంపదతో పాటు సదుపాయలను పాఠకులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు జాస్తి విజయ భూషణ్‌కుమార్, విశ్రాంత అధ్యాపకుడు గన్నె వెంకట్రావు, టీఎస్ఆర్కే ప్రసాద్, గ్రంథాలయ ఇన్‌చార్జీ డి.బాబురావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటర్‌నేట్ సేవలను ప్రారంభిస్తున్న రోటేరియన్లు





కాపు కమ్యూనిటీ భవనానికి ఎంపీ లాడ్స్ నిధులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో నిర్మిస్తున్న కాపు కమ్యూనిటీ భవనానికి మచిలీపట్నం లోక్‌సభ సభ్యుడు వల్లభనేని బాలశౌరి రూ. 50 లక్షలు ఎంపీ లాడ్స్ నిధులు కేటాయించారు. విజయవాడలోని ఎంపీ బాలశౌరి నివాసంలో ఆదివారం ఏపీ నాటక అకాడమీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ ఆధ్వర్యంలో పలువురు కాపు నాయకులు ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా కాపు కమ్యూనిటీ భవనానికి రూ. 50 లక్షల ఎంపీ లాడ్స్ నిధులు మంజూరు పత్రాన్ని ఆయన అందించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ. 25 లక్షలు మంజూరు చేయగా, దీనికి అదనంగా ఎంపీ బాలశౌరి మరో రూ.50 లక్షలు కేటాయించారు. అంతేకాక కమ్యూనిటీ హాల్‌కు కావాల్సిన గ్రానైట్ రాళ్లను సొంత నిధులతో ఏర్పాటు చేస్తానని ఎంపీ ప్రకటించినట్లు నక్కా గాంధీ పేర్కొన్నారు. ఎంపీ బాలశౌరికి కాపు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ బాలశౌరి సూచనల మేరకు కమ్యూనిటీ హాల్‌కు స్వర్గీయ వంగవీటి మోహనరంగా పేరును పెట్టాలని ప్రాతిపాదిస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి రామాంజనేయులు, కాపు నాయకులు నూకల బాలాజీ, నరహరిశెట్టి బాబురావు, చోడే లక్ష్మణరావు, పల్నాటి రాంబాబు, గంధం రామారావు, కమ్మిలి శ్రీధర్, సముద్రాల రాజాబాబు, వడ్డి గిరి, సురేష్ పాల్గొన్నారు.



కాపు కమ్యూనిటీ భవనానికి రూ.50 లక్షల నిధులు మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి







వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

పమిడిముక్కల: లయన్స్ క్లబ్ ఆఫ్ కపిలేశ్వరపురం ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఇంటర్నేషనల్ లయన్స్ వ్యవస్థాపకుడు ఎలివ్వన్ జోన్స్ జయంతి సందర్భంగా ప్రవాసాంధ్రురాలు డాక్టర్ మాధవి వితరణతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు లయన్స్ ట్రెజరర్ చిగురుపాటి జగదీష్ తెలిపారు. త్వరలో గ్రామంలో ఏకాత్మ గోశాల అనే పేరుతో సేవా సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు కార్యదర్శి తుమ్మల గంగాధరరావు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కడియాల ప్రకాశరావు, తుమ్మల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న గంగాధరరావు

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు



గుడివాడ టౌన్: ఏజీకే హైస్కూల్ షటిల్ కోర్టు 7వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. డిసెంబర్ 22న ఈ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో ఏ-పూల్ నుంచి 5 జట్లు, బీ-పూల్ నుంచి 9 జట్లు పాల్గొనగా ఏ-పూల్ నుంచి శ్రీకర్, జోసఫ్ టీమ్‌లు విన్నర్లుగా, సతీష్, మధు టీమ్‌లు రన్నర్లుగా నిలిచారు. బీ-పూల్‌లో అమ్మన్నబాబు, కేఎల్ శ్రీనాథ్ విన్నర్లుగా, సుధాకర్, శ్రీను టీమ్ రన్నర్లుగా నిలిచారని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు రిఫరీలుగా వ్యాయామ ఉపాధ్యాయులు భాస్కర్, సతీష్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ కృష్ణాజిల్లా గౌరవ అధ్యక్షుడు నీలం ప్రభాకర్, ఈడే శ్రీనివాసరావు పాల్గొన్నారు.







వణుదుర్రులో చీరల పంపిణీ

ముదినేపల్లి రూరల్: వణుదుర్రులో వృద్ధులకు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ ఈవోపీఆర్డీ ఈదా బైరాగి నూతన సంవత్సరం సందర్భంగా 150 మంది వృద్ధులకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా బైరాగి మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా గ్రామంలోని వృద్ధులకు ఈ విధంగా చీరలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. నూతన సంవత్సరంలో వీరంతా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు లేళ్ళ ఆంజనేయులు, ఈదా బాయమ్మ, విజయకుమారి, చంద్రలీల, ఐజాక్ రాజు, రెడ్డమ్మ పాల్గొన్నారు.



బండారుగూడెంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం బండారుగూడెంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని సర్పంచ్ వడ్లమూడి అమ్మాజీ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 రకాల సంక్షేమ పథకాలను అధికారులు తెలిపారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్, పీఎం ఆవాస్ యోజన, ప్రకృతి వ్యవసాయం, గ్రామీణ తపాల జీవిత బీమా పథకాలను ఆయా శాఖల అధికారులు ప్రజలకు వివరించారు. గ్రామ సచివాలయం ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన సందేశాన్ని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. వ్యవసాయంలో డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలతో కూడిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వడ్లమూడి తిరుపతిరావు, ఎంపీటీసీ సభ్యురాలు పరిమి మౌనిక, పంచాయతీ కార్యదర్శి ధారవతు తావరియా పాల్గొన్నారు.





క్లుప్తంగా

నూతన సంవత్సర శుభాకాంక్షలు



నూజివీడు: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదివారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖశాంతులతో, కలిసిమెలిసి జీవించాలని ఆకాంక్షించారు.

మైలవరం: మైలవరం నియోజకవర్గ ప్రజలకు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో అందరి కుటుంబాల్లో వెలుగులు నింపాలని, ప్రతి ఇంటా సుఖ సంతోషాలు వెల్లి విరియాలని మనసారా కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఒత్తిళ్లే సమస్యలకు కారణం



ఆటోనగర్(విజయవాడతూర్పు): మనసును నశింపచేయడమే అహంకారాన్ని వదలటమే యోగం.. ఆహాన్ని భగ్నం చేసేది జ్ఞానాగ్ని.. నవ్వుతూ జీవితాన్ని గడపడమే యోగం అని ఎం రఘుగురూజీ అన్నారు. వాసవ్య మహిళా మండలి సమావేశ మందిరంలో సమ భావనా మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం కోనేరు నరేంద్రబాబు అధ్యక్షతన ఆరోగ్యానికి వ్యక్తిత్వ వికాసానికి యోగా అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రఘు గురూజీ మాట్లాడుతూ.. మితాహారం అవసరమని.. 35 ఏళ్ల పాటు శరీరాన్ని కాపాడితే తర్వాత శరీరం మనల్ని కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో టి.శోభనాద్రి, యార్లగడ్డ రంగారావు, సీహెచ్ వెంకటరెడ్డి, గుమ్మా సాంబశివరావు పాల్గొన్నారు.

కార్మికులకు బియ్యం పంపిణీ



ఆటోనగర్(విజయవాడతూర్పు): నూతన సంవత్సరం సందర్భంగా లిడ్క్యాప్ చెప్పుల షోరూంలో పని చేసే కార్మికులకు లిడ్క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ బియ్యం బస్తాలను ఉచితంగా పంపిణీ చేశారు. 10 మంది కార్మికులకు ఒక్కొక్కరికి 25 కేజీల బియ్యం బస్తాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. లిడ్క్యాప్ చైర్మన్ సతీమణి షర్మిలా, వైఎస్ ట్రేడర్స్ అధినేత డి.ఆనంద్‌కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... సింగ్‌నగర్ నందమూరినగర్‌కు చెందిన వేమూరి సత్యనారాయణ (47) హైవే కాంట్రాక్టు పనులు చేస్తూ ఉంటాడు. ఆదివారం కావడంతో కూర తీసుకుందామని ఇంటి నుంచి తన బైకుపై పైపులరోడ్డు వైపు వెళ్తుండగా బ్రహ్మంగారి మఠం దగ్గరకు వచ్చేసరికి బైక్‌పై వస్తున్న ఇద్దరు మైనర్లు అతి వేగంగా వచ్చి సత్యనారాయణ బైకును ఢీకొట్టారు. దీంతో ఒక్కసారిగా అదుపుతప్పిన రోడ్డు మీద పడడంతో ఆయన తలకు బలమైన గాయమై అక్కడే కుప్పకూలిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య ఇహితవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రమాదానికి కారణమైన మైనర్ బాలురు, వాహన యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సత్యనారాయణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆయుర్వేదం, హోమియోతో వ్యాధులు నయం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆయుర్వేదం, హోమియో చికిత్స ద్వారా ఎటువంటి సైడు ఎఫెక్టులు లేకుండా అన్ని రకాల వ్యాధులను నయం చేయవచ్చని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్య నిపుణులు డాక్టర్ కోనా వీర బ్రహ్మం అన్నారు. దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటుబల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వ్యాధులు వచ్చిన తరువాత తీసుకునే చికిత్స కన్నా వ్యాధులు రాకుండా జాగ్రత్తగా ఉండటమే మంచిదన్నారు. ఇందుకుగానూ మంచి పౌష్టికాహారం తీసుకోవటంతో పాటు వైద్యుల సూచనలు సలహాలు తప్పక పాటించాలని సూచించారు. సుమారు 380 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు.

ప్రతి ఒక్కరూ క్రీడలను ప్రోత్సహించాలి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



వాలీబాల్ విజేతగా నిలిచిన యానాం జట్టుకు నగదు బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: క్రీడలను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావచ్చని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని హనుమంతులగూడెంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు శనివారం రాత్రితో ముగిశాయి. ఈ పోటీల విజేతగా యానం జట్టు నిలవగా, ద్వితీయస్థానంను తూర్పుగోదావరి జట్టు కైవసం చేసుకుంది. బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రతాప్ విజేతగా నిలిచిన యానాం జట్టుకు రూ.30 వేలను అందజేశారు. ద్వితీయస్థానంలో నిలిచిన తూర్పుగోదావరి జట్టుకు నిర్వాహకులు రూ.20 వేలు, తృతీయస్థానంలో నిలిచిన పశ్చిమగోదావరి జట్టుకు రూ.15 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన దమ్మపేట జట్టుకు రూ.10 వేలు, ఐదో స్థానంలో నిలిచిన ఈదర జట్టుకు రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, నాయకుడు రవికిరణ్ పాల్గొన్నారు.

ప్రత్యేక సిబ్బందితో నగర పరిశుభ్రతకు చర్యలు

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



నగరంలో పర్యటిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



నగరంలో చెత్త తరలింపును పర్యవేక్షిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రత్యేక సిబ్బందితో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ రత్నావళిని ఆదేశించారు. ఈ క్రమంలో మేయర్ భాగ్యలక్ష్మి ఆదివారం ఉదయం ఆర్టీసీ డిపో ఏరియా, 24వ డివిజన్ పరిధిలోని శాతవాహన కాలేజీ ప్రాంతం, 10వ డివిజన్ ఫన్‌టైమ్ క్లబ్ రోడ్, 3వ డివిజన్ కనకదుర్గానగర్ ప్రాంతాలను పరిశీలించారు. నగర వాసులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సిబ్బందిని పెంచి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నగర వ్యాప్తంగా 651 బ్లాక్ స్పాట్స్, లెగసీ వేస్ట్ పాయింట్స్‌ను గుర్తించామని మేయర్ తెలిపారు. కార్పొరేషన్, ప్రత్యేక పారిశుద్ధ్య సిబ్బంది విధుల్లో ఉన్నారన్నారు. మధ్యాహ్నం 12 గంటలకల్లా చెత్త తరలింపు వాహనాలతో దాదాపు 250కు పైగా ట్రిప్పులలో చెత్తను ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తరలిస్తున్నారన్నారు.

నగర పరిశుభ్రతకు సహకరించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నూతన సంవత్సరంలో ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులు, సిబ్బందితో కలిసి రాత్రి వేళల్లోనూ నగర పరిశుభ్రతలో నిమగ్నమయ్యారు. శనివారం అర్ధరాత్రి సమయంలో నగర వ్యాప్తంగా పర్యటించారు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తను జేసీబీ మెషిన్‌తో శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. రామలింగేశ్వరనగర్, ఏలూరు రోడ్, బీఆర్టీఎస్ రోడ్, సత్యనారాయణపురం, రామలింగేశ్వరపేట, ఎక్సెల్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో పేరుకుపోయిన చెత్తను అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన తొలగించి శుభ్రపరుస్తున్నారన్నారు. క్లాప్ వెహికల్స్ అందుబాటులో ఉంటాయని చెప్పారు. నగర పరిశుభ్రతకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

అభివృద్ధి పనులతో నియోజకవర్గ ముఖచిత్రం మార్పు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



61వ డివిజన్ ఎలక్ట్రికల్ కాలనీలో రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): సెంట్రల్ నియోజకవర్గ చరిత్రలో 2023 అభివృద్ధి నామ సంవత్సరంగా మిగిలిపోతుందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. నియోజకవర్గంలో రూ.2.60 కోట్ల అభివృద్ధి పనులకు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్లు ఇసరపు దేవి, ఉమ్మడి రమాదేవి, మోదుగుల తిరుపతమ్మతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో నాలుగున్నరేళ్ల కాలంలోనే సెంట్రల్ ముఖచిత్రంలో ఎంతో మార్పు వచ్చిందని తెలిపారు. నిత్యం అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో ఈ ప్రాంతామంతా కళకళలాడిందని చెప్పారు. ప్రధానంగా రోడ్ల నిర్మాణంలో కనీవినీ ఎరుగని అభివృద్ధిని సాధించటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇందులో భాగంగా న్యూ రాజరాజేశ్వరిపేటలో రూ.99.65 లక్షల వ్యయంతో నిర్మించిన రోడ్లతో పాటు రూ.70 లక్షలతో నందమూరి నగర్, రూ.34.07 లక్షలతో ఎలక్ట్రిసిటీ కాలనీ, రూ.19.07 లక్షలతో విశాలాంధ్ర కాలనీలో నిర్మించిన నూతన రహదారులను ప్రారంభించుకున్నట్లు తెలిపారు. అలానే వశిష్ట కాలనీలో రూ.36.45 లక్షలతో బీటీ రోడ్ల నిర్మాణంతో పాటు తోటవారి వీధిలో రూ.17 లక్షలతో తాగునీటి పైపులైన్ల వ్యవస్థను మెరుగుపరచేందుకు భూమిపూజ చేశామని చెప్పారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలపై ఈ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వ్యవస్థ, అర్బన్ హెల్త్ సెంటర్లు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, ఆర్‌యూబీలు విద్యుత్‌సబ్ స్టేషన్లు, ఇలా నిత్యం అభివృద్ధి కార్యక్రమాలతో నియోజకవర్గం వెలిగిపోతుందని వివరించారు. కనుక 2023 ఏడాదిని సంక్షేమ, అభివృద్ధి నామ సంవత్సరంగా అభివర్ణించడంలో ఎటువంటి అతిశయోక్తి లేదన్నారు. ప్రజల ప్రోత్సాహం, సహకారంతోనే ఇంతటి అనితర సాధ్యమైన అభివృద్ధిని సాధించినట్లు చెప్పారు. గతేడాది సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని కొత్త సంవత్సరంలో మరింత ముందడుగు వేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈలు గురునాథం, సింధూర, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, ఇసరపు రాజారమేష్, ఉమ్మడి వెంకట్రావ్, అఫ్రోజ్, మోదుగుల గణేష్, నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

అజిత్‌సింగ్‌నగర్: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా సింగ్‌నగర్‌లో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... సింగ్‌నగర్ వడ్డెర కాలనీకి చెందిన గుంజా శివకుమార్ ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున వంటగదిలో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. విషయాన్ని గమనించిన వారు పెద్ద పెద్ద కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు, అగ్నిమాపకశాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. ఫ్రిజ్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఈ ప్రమాదం చోటుచేసుకుందని అగ్నిమాపక శాఖ అధికారులు నిర్ధారించారు. ఈ ఘటనలో రూ.75 వేల విలువైన ఎలక్ట్రికల్ సామాన్లు కాలిపోయాయి. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి బాధితులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు.

రంగవల్లులతో నూతన సంవత్సరానికి ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని మహిళలు రంగవల్లులతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఆదివారం సాయంత్రం నుంచి చలిని సైతం లెక్కచేయకుండా రంగవల్లులను సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

తాడంకి హైస్కూల్‌కు మహర్దశ



తాడంకి హైస్కూల్



నాడు-నేడులో మరమ్మతులు చేసిన తాడంకి హైస్కూల్ తరగతి గదులు

- నాడు-నేడు నిధులు రూ.1.25 కోట్లతో అభివృద్ధి
- వందేళ్ల చరిత్ర కలిగిన హైస్కూల్‌కు నూతన హంగులు

పమిడిముక్కల: పేదల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. విద్యకు పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తోంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతోంది. రూ.1.25 కోట్ల నాడు-నేడు నిధులతో తాడంకి హైస్కూల్‌ను సుందరంగా తీర్చిదిద్దడం ఇందుకు ఒక ఉదాహరణ.

గత పరిస్థితి ఇదీ..

తాడంకి హైస్కూల్‌కు వందేళ్ల చరిత్ర ఉంది. ఈ పాఠశాలలో 482 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మంటాడ, తాడంకి, మద్రివాడ, గోపువానిపాలెం, గురజాడ, సాయిపురం గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. పెంకుటిల్లు పూర్తిగా దెబ్బతినడం, భవనాలు శిథిలావస్థకు చేరడంతో వర్షం పడితే నీరు కారడం, పెచ్చులూడి పడటం జరిగేది. వర్షం పడితే పాఠశాల ఆవరణ, ఆట స్థలం జలమయంగా మారేది. విద్యార్థులు, ఉపాధ్యాయులు తరగతి గదుల్లో బిక్కుబిక్కుమంటూ కాలం గడిపేవారు.

రూ.1.25 కోట్లతో..

ఈ పాఠశాలకు నాడు-నేడు మొదటి, రెండో విడత కింద రూ.1.25 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో పెంకుటిల్లు, భవనాలకు మరమ్మతులు చేపట్టారు. అదనపు తరగతి గదులు నిర్మించారు. తరగతి గదుల్లో ఫ్యాన్లు, బెంచీలు సమకూర్చారు. అవసరమైన మేర మరుగుదొడ్లు నిర్మించారు. ఉపాధి నిధులు రూ.5 లక్షలతో ప్రహరీ నిర్మించారు. దతల సహకారం రూ.5 లక్షలతో ఆటస్థలాన్ని అభివృద్ధి చేశారు. పూర్వ విద్యార్థులు సమకూర్చిన రూ.2 లక్షలతో పాఠశాల ఆవరణను మెరక చేశారు. హైస్కూల్‌ను సుందరంగా తీర్చిదిద్దారు.

సీఎంకు కృతజ్ఞతలు..



గతంలో హైస్కూల్లో సరైన సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. నాడు-నేడు పథకం కింద అవసరమైన సౌకర్యాలు కల్పించారు. పేద పిల్లలు చదువుకొనే పాఠశాలను కార్పొరేట్ స్థాయికి తీర్చిదిద్దారు. విద్యార్థులు, తల్లిదండ్రుల తరఫున సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. తాగునీటి కోసం బోర్‌వెల్ వేయాలని, ప్రహరీ నిర్మాణం చేయాలని కోరుతున్నాను.

–కంభపు రాంబాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్

దాతల సహకారం..



పార్క్ అభివృద్ధికి, ఆటస్థలం మెరకకు దాతలు సహకారం అందించాలి. ఆటస్థలంలో మురుగు బయటకు పోయే ఏర్పాటు చేయాలి. విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి, హైస్కూల్ అభివృద్ధికి పాటుపడుతున్న పేరెంట్స్ కమిటీ, జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకట రమణకుమారి, సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, దాతలు, గ్రామస్తులకు కృతజ్ఞతలు.

–ప్రసాద్, హెచ్ఎం, తాడంకి

నూతన సంవత్సరానికి ఘన స్వాగతం



నూజివీడులోని చిన్నగాంధీబొమ్మ సెంటర్‌లో కేక్ కట్‌చేస్తున్న యువత



తిరువూరు శ్రీనిధి స్కూల్లో నూతన సంవత్సర వేడుకలు

తిరువూరు: నూతన ఆంగ్ల సంవత్సరానికి స్వాగతం పలుకుతూ తిరువూరులోని పలు పాఠశాలల్లో ఆదివారం కార్యక్రమాలు జరిగాయి. 2024 సంవత్సర అక్షరాల ఆకారంలో శ్రీనిధి స్కూలు విద్యార్థులు స్వాగత వేడుకలు జరిపారు. విద్యార్థినులు నృత్యప్రదర్శనలిచ్చారు. పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటనారాయణ కేక్‌కట్ చేసి విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. విద్యార్థినులకు, ఉపాధ్యాయులకు పాఠశాల నిర్వాహకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

నూజివీడు: యువతీ, యువకుల కేరింతలు.. చిన్నపిల్లల ఆనందోత్సాహాల నడుమ పట్టణ ప్రజలు ఆదివారం అర్ధరాత్రి 2023కి గుడ్ బై చెబుతూ.. నూతన ఆంగ్ల సంవత్సరం 2024కు ఆహ్వానం పలికారు. గత సంవత్సరపు చేదు జ్ఞాపకాలను వదిలి నూతన సంవత్సరపు ఆశల హరివిల్లుకు స్వాగతం చెప్పారు. కొందరు కేక్‌లు కట్‌చేశారు.

పరిసరాల శుభ్రత సామాజిక బాధ్యత



చెత్త తొలగిస్తున్న కార్పొరేటర్ రామిరెడ్డి, నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి అన్నారు. ఆదివారం రాణిగారితోట, 17వ డివిజన్‌లో ఆయన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పలు వీధుల్లో రోడ్లు ఊడ్చి శుభ్రం చేశారు. కుప్పలుకుప్పలుగా పేరుకుపోయిన చెత్త కుప్పలను క్లాప్ ఆటోలకు ఎత్తి తరలించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేయడంతో డివిజన్‌లో పలు చోట్ల చెత్త పేరుకుపోయిందన్నారు. దీంతో దుర్వాసన వెలువడుతుండడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆ విషయం తన దృష్టికి రావడంతో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రోడ్లు శుభ్రం చేసి, చెత్తను తొలగించామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కె.దామోదర్, కాశీం, నరసింహారెడ్డి, అయ్యపరెడ్డి, తిరుపతిరెడ్డి, జయలక్ష్మి, వెంకటస్వామి, సాయికృష్ణారెడ్డి, మోహిద్దీన్, రాజేష్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు సంఘటితంగా ఉండాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముదిరాజ్‌లు సంఘటితంగా ఉండి హక్కుల కోసం పోరాడటానికి కలిసి రావాలని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కోర్డ నారాయణ ముదిరాజ్ పిలుపునిచ్చారు. 20 లక్షలు పైగా ఉన్న ముదిరాజులను చైతన్యపరిచి రాజకీయ హక్కుల కోసం పోరాడేందుకు ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ ప్రచార చైతన్య రథం ప్రారంభించి కళా జాతాలు నిర్వహిస్తుంది.. డిసెంబర్ 22వ తేదీన ప్రకాశం జిల్లా ఒంగోలులో ప్రారంభమైన ప్రచార చైతన్య రథం ప్రకాశం, గుంటూరు జిల్లాలు మీదుగా ఆదివారం మధురానగర్‌కు చేరుకుంది. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు వర్ల నారాయణ ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి వలిబోయిన రాజు ముదిరాజ్ ఆధ్వర్యాన చైతన్య రథం మధురానగర్‌లో కొనసాగింది. ప్రజా కళాకారుడు బుల్లెట్ వెంకన్న ముదిరాజ్ ఆధ్వర్యంలో కళాకారులు ప్రజాగేయాలతో చైతన్య పరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో ముదిరాజ్‌లను రాజకీయంగా చైతన్య పరిచేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వలిబోయినరాజు ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుప్పలశివాజీ ముదిరాజ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీగణేష్ ఉపాధ్యక్షుడు కోలా ఏడుకొండలు తోకల రవి,బుస్సా రామకృష్ణ , శంకర్ సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలి

షిరిడీ సాయిబాబా మందిరం క్యాలెండర్ ఆవిష్కరించిన గౌతంరెడ్డి



బాబా మందిరంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిరిడీగా విరాజిల్లుతున్న ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరం ఆధ్వర్యాన నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని కోరుతూ భక్తులకు పదివేల క్యాలెండర్‌లు పంపిణీ చేయనున్నట్లు మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి తెలిపారు. మందిర కమిటీ ఆధ్వర్యాన ఆదివారం నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మందిర సభ్యులతో కలిసి నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన ముత్యాలంపాడు షిరిడీ సాయి బాబావారి ఫొటోతో ముద్రించిన క్యాలెండర్‌ను ఇంట్లో ఉంచుకోవటం భక్తులకు ఆనవాయితీగా మారిందన్నారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఏటా క్యాలెండర్‌లను ముద్రించి భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం 10 వేల క్యాలెండర్‌లను ఆదివారం అర్ధరాత్రి నుంచి పంపిణీ చేయనున్నామన్నారు. మందిర అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అడపా బాబ్జీ చిరస్మరణీయుడు

బాబ్జీ చిల్డ్రన్స్ పార్కు ప్రారంభ కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే



పార్కును ప్రారంభిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: ఆప్తమిత్రుడు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అడపా బాబ్జీ చిరస్మరణీయుడని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. ఆదివారం స్థానిక పెద ఎరికపాడులో 15వ ఆర్థిక సంఘం, మున్సిపల్ సాధారణ నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన అడపా బాబ్జీ చిల్డ్రన్స్ పార్కును ఆయన బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎరికపాడు ప్రజలకు ఆదర్శంగా, అండగా నిలుస్తూ రెండు తరాలుగా అడపా బాబ్జీ కుటుంబం పనిచేసిందన్నారు. ఆయన అకాల మరణం కుటుంబానికి తీరని లోటని బాబ్జీ జ్ఞాపకార్థం ఈ పార్కును నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, పాలేటి చంటి, అడపా పండు, అలంకార్ శేఖర్, అడబాల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

'మానవత' డైరెక్టరీ ఆవిష్కరణ

పామర్రు: నూతన సంవత్సరంలో ప్రజలు సుఖశాంతులతో సంతోషాలతో ఉండాలని పామర్రు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి అన్నారు. పామర్రు మానవత సేవ సంస్థ సమావేశం ఆదివారం నిర్వహించారు. మానవత సేవా సంస్థ రూపొందించిన పుస్తకాన్ని (డైరెక్టరీ)ని ఆవిష్కరించారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో సేవా సంస్థలు భాగస్వాములు కావాలని అన్నారు. పామర్రు మానవత సేవా సంస్థ అధ్యక్షుడు ఐవీఎస్ మనోహరరావు అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో జిల్లా కార్యదర్శి శీతాల ప్రసాద్, రీజియన్ చైర్మన్ పీఎంఎస్ ప్రసాద్, కార్యదర్శి పామర్తి వెంకట నారాయణ, కోశాధికారి పీబీ శ్రీనివాస్, కన్వీనర్ ఎస్.త్రివిక్రమరావు, డైరెక్టర్లు అల్లాడ సోమ శేఖరరావు, రవీంద్ర, మండపాక సుబ్బారావు, రెడ్రౌతు నరసింహారావు, వేణు, తాడిశెట్టి సాయిబాబు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెరకులోడు ట్రాక్టర్ పల్టీ



తోట్లవల్లూరు: చెరకులోడు ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిన ఘటన తోట్లవల్లూరు సమీపంలో జరిగింది. తోట్లవల్లూరు వైపు నుంచి ఉయ్యూరు కేసీపీ చక్కెర కర్మాగారానికి చెరకు లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఆదివారం సాయంత్రం బందరు కాలువ వంతెన దిగే క్రమంలో ప్రమాదవశాత్తు పల్టీ కొట్టింది. దీంతో ఉయ్యూరు-తోట్లవల్లూరు మధ్య వాహనాల రాకపోకలకు కొద్ది సేపు అంతరాయం కలిగింది. అధిక లోడుతో చెరకును ట్రాక్టర్లు రవాణ చేయటం వలనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు అంటున్నారు. రవాణ, పోలీసు స్పందించాలని కోరుతున్నారు.